

# ఒలింపిక్స్ నిర్వహణ భారత్ కల

• ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ వంటి భారీ క్రీడా ఈవెంట్స్‌ను నిర్వహించడం భారత్ కల అని, 2036లో దేశంలో విశ్వక్రీడలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని ప్రధాని మోదీ అన్నారు. దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటపై జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. 'గతేడాది జీ-20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించాం. దేశవ్యాప్తంగా 200 ఈవెంట్స్‌ను ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా నిర్వహించగలమని నిరూపించాం. ఒలింపిక్స్ నిర్వహణ భారత్ కల. ఆ క్రమంలోనే 2036 ఒలింపిక్స్ కోసం సిద్ధమవుతున్నాం' అని అన్నారు. 2036 ఒలింపిక్స్ కోసం భారత్ బిడ్ వేయనున్న విషయం తెలిసిందే. ఇక 'పారిస్'లో పతకాలు గెలిచి మువ్వన్నెల పతకాన్ని రెపరెపలాడించిన క్రీడాకారులకు దేశ ప్రజల తరపున మోదీ అభినందనలు తెలిపారు. అంతేగాక త్వరలోనే పారాలింపిక్స్‌లో బరిలోకి దిగనున్న అథ్లెట్లకూ శుభాకాంక్షలు చెప్పారు.

# యమాల్ తండ్రిపై హత్యాయత్నం



బార్సిలోనా: ఫుట్‌బాల్ యువ సంచలనం, ఇటీవలే యూరో కప్ నెగ్గిన స్పెయిన్ జట్టులోని ఆటగాడు లమినె యమాల్ తండ్రి మోనిర్ నస్రోయ్ హత్యాయత్నానికి గురయ్యాడు. బుధవారం ఆయనపై గుర్తుతెలియని దుండగులు దాడికి దిగినట్టు అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) ఓ కథనంలో పేర్కొంది. హత్యాయత్నం జరిగిన వెంటనే మోనిర్‌ను స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించగా ఆయన పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్టు సమాచారం. కాగా సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడ్డట్టుగా అనుమానిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.



# బీసీ రాయ్ ఫుట్‌బాల్ చాంప్ తెలంగాణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నాగోన్(అస్సాం) వేదికగా జరిగిన బీసీ రాయ్ ఫుట్‌బాల్ చాంపియన్‌సిప్‌లో తెలంగాణ బాలుర జూనియర్ జట్టు విజేతగా నిలిచింది. తెలంగాణ, మణిపూర్ మధ్య హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరు నిర్ణీత సమయంలో 1-1తో డ్రాగా ముగిసింది. అయితే విజేతను నిర్ణయించేందుకు జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో తెలంగాణ 4-3తో మణిపూర్‌పై విజయాన్నందుకుంది. యఫబా, ఫైజాన్, సాజిద్, ఒమర్ ఫారుఖ్ తెలంగాణ తరఫున గోల్స్ చేశారు. టైటిల్ విజేతగా నిలిచిన జట్టును రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ అభినందించారు.

# బాక్సింగ్ క్లబ్‌తో రానా జట్టు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: యూఎఫ్‌సీ చాంపియన్ అంథోనీ పెట్టిస్ ఫైట్ క్లబ్‌తో ప్రముఖ తెలుగు సినీ నటుడు దగ్గుబాటి రానా జతకట్టాడు. తన స్పిరిట్ మీడియా ఫౌండర్‌కు చెందిన బాక్సింగ్ బే ద్వారా..అంథోనీ పెట్టిస్ ఫైట్‌క్లబ్(ఏపీఎఫ్‌సీ)తో గురువారం భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. వరల్డ్ బాక్సింగ్ కౌన్సిల్(డబ్ల్యూబీసీ)కి చెందిన ప్రతినిధులు ఆస్కార్ విల్లే, ఎరికా కాంటెరస్ హాజరయ్యారు. ఈ ఏడాది తర్వాత రెండు మేజర్ బాక్సింగ్ ఈవెంట్లలో ఒకటి అమెరికాలో, మరొకటి భారత్‌లో భారీస్థాయిలో నిర్వహించబోతున్నారు. భారత్‌లో బాక్సింగ్ అభివృద్ధి కోసం ప్రయత్నం చేస్తున్నామని, ఏపీఎఫ్‌సీతో భాగస్వామ్యం ద్వారా దేశంలో నూతన ఒరవడి తీసుకొస్తామని రానా పేర్కొన్నాడు.

# సిన్నర్, స్వియాటెక్ ముందంజ


• సిన్సినాటి ఓపెన్



మసాన్: టాప్ సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ), ఇగా స్వియాటెక్ (పోలండ్) సిన్సినాటి ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరారు. పారిస్ ఒలింపిక్స్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం నెగ్గిన స్వియాటెక్ మహిళల సింగిల్స్ విభాగంలో 6-0, 6-7 (8/10), 6-2తో వర్వర గ్రచెవ (రష్యా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఒకటో సీడ్ సిన్నర్ 6-4, 7-5తో అలెక్స్ మైకెల్సెన్ (యూఎస్‌ఏ)ను వరుస సెట్లలో ఓడించి ప్రిక్వార్టర్స్ చేరాడు.

# నువ్వు మా చాంపియన్‌వి

## తీర్పు నిరాశకు గురిచేసింది • వినేశ్‌కు క్రీడాలోకం మద్దతు



ఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ 'అనర్హత వేటు'పై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్(కాస్)లో తీర్పు దేశ ప్రజలను నిరాశకు గురిచేసినా క్రీడాలోకం మాత్రం ఆమెకు మద్దతుగా నిలిచింది. పతకం రాకపోయినా ఆమె చాంపియన్ అని కొనియాడింది. వినేశ్ కేసులో ఇరు పక్షాల వాదనలు విన్న కాస్.. ఈనెల 16న తీర్పు వెలువరించాల్సి ఉన్నా 14వ తేదీ రాత్రి ఉన్నఫళంగా ఆమె పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు ప్రకటించడం భారత క్రీడాభిమానులను నివ్వెరపోయేలా చేసింది. కారణాలేమీ చెప్పకుండానే 'సింగిల్ లైన్ ఆర్డర్'తో కాస్ వెలువరించిన ప్రకటన అనంతరం ఆమెకు పలువురు క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. హాకీ దిగ్గజం శ్రీజేష్, జర్మన్‌ప్రీత్, అమిత్ రోహిదాస్, రెజ్లర్ బజరంగ్ పునియా, మాజీ బాక్సర్ విజేందర్ సింగ్, జాతీయ రెజ్లింగ్ కోచ్ విజయ్ దహియా వినేశ్‌కు అండగా నిలిచారు. 'నీకు దక్కాల్సిన పతకాన్ని చీకట్లో లాగేసుకున్నారు. కానీ నువ్వు ఈరోజు ప్రపంచం ఎదుట కోహినూర్ వజ్రంలా ప్రకాశిస్తున్నావు' అని ఎక్స్ వేదికగా పునియా రాసుకొచ్చాడు. 'ఇది చాలా బాధాకరం. అత్యుత్తమంగా పోరాడి ఇలాంటిది ఏదైనా జరిగినప్పుడు సదరు క్రీడాకారులు ఎలా బాధపడతారో మేం అర్థం చేసుకోగలం. కానీ నువ్వు మాత్రం మాకు ఎప్పటికీ చాంపియన్‌వే' అని జర్మన్‌ప్రీత్ అన్నాడు. 'దేశం మొత్తం ఆమెకు అండగా ఉంది' అని రోహిదాస్ చెప్పాడు. విజయ్ దహియా స్పందిస్తూ.. 'తీర్పు మాకు అనుకూలంగా వస్తుందనుకున్నాం. కానీ దురదృష్టవశాత్తూ వినేశ్ పిటిషన్‌ను కాస్ కొట్టేసింది. ఆమె పోటీలోకి దిగితే స్వర్ణం గెలిచేది. కనీసం రజతం అయినా వస్తుందని ఆశించినా కాస్‌లోనూ నిరాశే ఎదురైంది. ఇది తీవ్ర అన్యాయం' అని అన్నాడు. 'తీర్పు చాలా బాధాకరం. మేం వినేశ్‌కు అండగా నిలబడుతున్నాం. ఆమెకు ఎల్లప్పుడూ మా మద్దతు ఉంటుంది' అని విజేందర్ తెలిపాడు.

కాస్ తీర్పు నేపథ్యంలో వినేశ్ ఫోగాట్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఎమోషనల్ పోస్ట్ వైరల్‌గా మారింది. పారిస్ ఒలింపిక్స్ బౌట్‌లో మ్యాట్‌పై పడుకొని కన్నీటితో బాధపడుతున్న ఫొటోను పోస్ట్ చేసింది. దీనికి ప్రముఖ పంజాబీ సింగర్ 'బీ ప్రాక్' పాడిన 'రబ్బా వే' పాటను జత చేసింది. ఒలింపిక్ పతకం విషయంలో తన దురదృష్టాన్ని సూచిస్తూ ఫోగాట్ ఈ పోస్ట్ చేసినట్లు తెలుస్తున్నది.

# సాయం చేస్తే సత్తాచాటుతా

## ఆర్థిక మద్దతు కోసం యువ లిఫ్టర్ వైష్ణవి మహేశ్ ఎదురుచూపులు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆర్థిక సాయం చేస్తే సత్తాచాటుతానని తెలంగాణ యువ పవర్‌లిఫ్టర్ వైష్ణవి మహేశ్ ధీమా వ్యక్తం చేస్తున్నది. సన్‌సిటీ(దక్షిణాఫ్రికా) వేదికగా అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్న కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో భారత జట్టుకు వైష్ణవి(84కి) ఎంపికైంది. తెలంగాణ నుంచి వైష్ణవితో పాటు సుకన్య తేజావత్(76కి), మోడం వంశీ(66కి)జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించబోతున్నారు. అయితే దక్షిణాఫ్రికా టోర్నీలో పోటీపడేందుకు వైష్ణవికి ఆర్థిక సమస్యలు ప్రతిబంధకంగా మారాయి. ఎవరైనా తోడ్పాటు అందిస్తే అంతర్జాతీయ వేదికపై దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా పతకాలు సాధిస్తానని ఈ యువ లిఫ్టర్ ఆత్మవిశ్వాసంతో ఉన్నది. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పతకాలు కొల్లగొట్టిన వైష్ణవి ప్రస్తుతం స్పాన్సర్ల కోసం ఎదురుచూస్తున్నది. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపించి ఆర్థికంగా మద్దతుగా నిలిస్తే ప్రతిభ చాటేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఆయా టోర్నీల్లో పతకాలు సాధించినందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నగదు ప్రోత్సాహం అందలేదని వాపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు కలుగజేసుకోవాలని అభ్యర్థిస్తున్నది.

# మహిళల ప్రపంచకప్‌నకు నో

## బీసీబీ, ఐసీసీ విజ్ఞప్తికి బీసీసీఐ నిరాకరణ • బోర్డు కార్యదర్శి జైషా స్పష్టీకరణ



ఢిల్లీ: ఈ ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్ వేదికగా జరగాల్సి ఉన్న మహిళల టీ20 ప్రపంచకప్‌ను భారత్‌కు తరలించాలన్న విజ్ఞప్తిని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తిరస్కరించిందట. బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశ క్రికెట్ బోర్డు (బీసీబీ)తో పాటు ఐసీసీ సైతం బీసీసీఐని కోరినా దానిపై విముఖత చూపినట్టు బీసీసీఐ సెక్రటరీ జై షా తెలిపాడు. టైమ్స్ ఆఫ్ ఇండియాకు గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'మహిళల టీ20 ప్రపంచకప్‌ను నిర్వహించాలని బీసీబీతో పాటు ఐసీసీ నుంచి ప్రతిపాదన వచ్చింది. కానీ మేం దానిని తిరస్కరించాం. వరల్డ్‌కప్ షెడ్యూల్ సమయానికి భారత్‌లో ఇంకా వర్షాకాలమే ఉంటుంది. అదీగాక వచ్చే ఏడాది మేం మహిళల వన్డే ప్రపంచకప్‌ను నిర్వహించాల్సి ఉంది. వరల్డ్‌కప్ వంటి మెగా ఈవెంట్లను వరుస ఏడాదుల్లో నిర్వహించడం కష్టం' అని షా చెప్పాడు. భారత్‌లో డే అండ్ నైట్ టెస్టులు వర్కవుట్ కాబోవని షా స్పష్టం చేశాడు. ఈ టెస్టులు రెండు రోజుల్లోనే ముగుస్తుండటంతో దీనివల్ల ప్రేక్షకులు, ప్రసారదారులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని తెలిపాడు. ఇది భావోద్వేగంతో కూడుకున్న వ్యవహారమని అన్నాడు. 2022 తర్వాత భారత్ స్వదేశంలో 'గులాబీ టెస్టు' ఆడలేదు. టెస్టు క్రికెట్ మనుగడ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆ క్రమంలో టెస్టుల కోసం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్టు షా తెలిపాడు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీకి సమాంతరంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మరో ఎన్‌సీఏ నిర్మాణం జరుగుతోందని ఇందులో క్రికెటర్లతో పాటు నీరజ్ చోప్రా వంటి అథ్లెట్లు సైతం ప్రాక్టీస్ చేసుకునే విధంగా వసతులు అందుబాటులో ఉంటాయని షా తెలిపాడు.

# సచిన్ @ 2.15 కోట్లు

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో 11వ సీజన్ కోసం గురువారం వేలంపాట హాట్‌హాట్‌గా సాగింది. తొలి రోజు వేలంలో యువ రైడర్ సచిన్ తన్వర్‌ను తమిళ్ తలైవాస్ రూ.2.15 కోట్లకు తీసుకుంది. సచిన్‌తో పాటు ఇరాన్‌కు చెందిన ఆల్‌రౌండర్ మహమ్మద్ రెజా షాద్లీని హర్యానా స్టీలర్స్ రూ.2.07కోట్లకు కొనుగోలు చేసింది. స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్‌ను తెలుగు టైటాన్స్ తిరిగి రూ.1.72కోట్లకు అట్టిపెట్టుకుంది. మొత్తంగా తొలి రోజు ఎనిమిది మంది భారత ప్లేయర్లు వేలంలో కోటి రూపాయలకు పైగా పలుకడం విశేషం. వేలంలో భారీ ధర రావడం పీకేఎల్‌కు పెరుగుతున్న ఆదరణ అని సచిన్ తన్వర్ పేర్కొన్నాడు.

# దక్షిణాఫ్రికా 97/9

• షమర్ ధాటికి విలవిల

గయానా: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ బౌలర్లు అదరగొట్టారు. యువ పేసర్ షమర్ జోసెఫ్, జేడన్ సీల్స్ రాణించడంతో 37 ఓవర్ల ఆట ముగిసేసరికి సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 97 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. జోసెఫ్ 5 వికెట్లతో విజృంభించగా సీల్స్ 3 వికెట్లు పడగొట్టాడు. సఫారీ బ్యాటర్లలో బెడింగ్‌హామ్ (28), ట్రిస్టన్ స్టబ్స్ (26), కైల్ (21), మార్క్‌రమ్(14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. నలుగురు డకౌట్ కాగా ఇద్దరు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.